క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ క్షేత్రమైన అత్తిరాలలోని శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి పౌర్ణమి సందర్భంగా భక్తులు గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం సాయంత్రం 6 గంటలకు గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రేతేశ్వరునికి మొక్కులు చెల్లించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా బాహుదా నదికి గంగా హారతి నిచ్చారు. పట్టణంలోని ఎర్రబల్లికి చెందిన భక్తులు కటారు లక్ష్మీదేవి, నాగిరెడ్డి దంపతులు కామాక్షి మాతకు చీరే సారే అందించారు. స్వామి వారిని, అమ్మవారిని ప్రత్యేక పల్లకీలో కొలువుదీర్చి గిరి ప్రదక్షిణ చేశారు. గిరి ప్రదక్షిణ భక్త మండలి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

29 నుంచి అభిప్రాయ సేకరణ

రాయచోటి టౌన్ : ఈనెల 29 నుంచి 31 వరకు అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు రాయచోటి విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నట్లు తెలియజేశారు.

తైక్వాండోలో ప్రతిభ

నందలూరు(రాజంపేట) : ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి 37వ సబ్ జూనియర్స్ తైక్వాండో కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో మండల కేంద్రం విద్యార్థులు ప్రతిభచాటారు. విన్డమ్ స్కూల్ విద్యార్థులు పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వలిమి మనోజ్ఞ సాయి సిల్వర్ మెడల్, నిర్వాన్ నందన్, ఎస్.మోక్షిత్, పి.శ్రీనివాసులు, శ్రీరూప, ఎస్.మౌలా వివిధ కేటగిరిలో విజయం సాధించి మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్నారు. వీరిని ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ అభినందించారు.

క్రీడల్లో విద్యార్థుల రాణింపు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు జూనియర్ కళాశాలలో మైదానంలో గురువారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడలలో ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థినులు కబడ్డీలో ప్రథమస్థానం సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి

రాయచోటి టౌన్ : రాజంపేటలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురువారం రాష్ట్ర అధ్యక్షుడు పావలూరి హనుంత రావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోమారపు నాగార్జున ఆచారి, గౌరవాధ్యక్షులుగా లక్ష్మీ ప్రసన్న ఆచారి, సలహా కమిటీ చైర్మన్ డాక్టర్ సుధాకర్ ఆచారి, ప్రధాన కార్యదర్శి టి.మోహన్ ఆచారి, కోశాధికారి సి.రత్నం ఆచారిలను ఎన్నుకున్నారు.

27న 'వైఎస్సార్ ఆసరా'

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండలంలో ఈనెల 27వ తేదీ శనివారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ వరప్రసాద్ గురువారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో జరిగే కార్యక్రమానికి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

చిట్వేలి : రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను అందించాలని ఏడీఏ మణి దుకాణాదారులను ఆదేశించారు. గురు వారం చిట్వేలిలోని దుకాణాలను వ్యవసాయ అధికారి సందీప్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. అనంతరం దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నాసిరకం ఎరువులు, పురుగు మందులు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విశ్రాంత ఉద్యోగుల ధర్నా

రాయచోటి టౌన్ : తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలంటూ విశ్రాంత ఉద్యోగులు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద వివిధ శాఖలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు. ఐదు ప్రధాన సమస్యలను పరిష్కరించాలంటూ వినతి పత్రాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి అందజేశారు.

తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రం

చిన్నమండెం : మండల పరిధిలోని సి.పాలిమేరపల్లి గ్రామం బెస్తపల్లెలో ఉండే అంగన్‌వాడీ కేంద్రానికి తాళాలు వేసి ఉందని గ్రామస్తులు తెలిపారు. నెమ్మె పూర్తైన ఇంత వరకు మా ఊర్లో అంగన్‌వాడీ కేంద్రం తెరవలేదని వాపోయారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రం తెరుచుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

సమస్యలు పరిష్కరించండి

రాజంపేట : సమస్యలు పరిష్కరించాలని గురువారం మున్సిపల్ కమిషనరు జనార్దన్‌రెడ్డికి మున్సిపల్ కార్మికులు వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ ఆధ్వర్యంలో కమిషనరుకు డిమాండ్లను పరిష్కరించాలని విన్నవించారు.

ఆశ్రమంలో అన్నదానం

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లె మాజీ ఎంపీటీసీ ముక్కా ప్రతాప్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం గురువారం పాపిరెడ్డిపల్లె జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జగన్ పాలనలో 'మహిళలే మహారాణులు'

- మహిళల జీవితాలలో వెలుగులు నింపాలన్నదే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం
- లక్కిరెడ్డిపల్లెలో జరిగిన నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా సదస్సులో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : వైఎస్సార్ ఆసరా పొదుపు సంఘాల అక్కాచెల్లెమ్మలకు వరం అని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లె మండలంలో జరిగిన వైఎస్సార్ ఆసరా సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో అక్కాచెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను సీఎం అయ్యాక నెరవేర్చారన్నారు. ఎన్నికల సమయానికి ఉన్న డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని చెప్పి నేటితో సంపూర్ణంగా ఆ హామీని నిలబెట్టుకున్నారన్నారు. సంక్షేమ పథకాలను మహిళలకు ఇస్తూ వారిని మహారాణులుగా వెలుగొందేలా చేస్తున్నారన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో వైఎస్సార్ ఆసరా నాల్గో విడత కింద 436 సంఘాలకు రూ. 3.07 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయంలో ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, 108, 104, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర ఎన్నో పథకాలను పెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలోనే సీఎం జగన్ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ, అమ్మఒడి, చేయూత, ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలను అమలు చేశారన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. విద్యాభివృద్ధికి పెట్టే ప్రతి రూపాయి ఈ రాష్ట్ర ఆస్తి అని భావిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వ అనుపత్రుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం పైన ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న విష్షప్రచారాన్ని తిప్పికొట్టాలని తెలియజేశారు.

సీఎం జగన్‌వైపు ధర్మం, న్యాయం ఉన్నాయి..

సీఎం జగన్ వైపు ధర్మం, న్యాయం ఉన్నాయన్నారు. చంద్రబాబు పాలన అంతా మోసం, దగాలతో జరిగిందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. జై జగనన్న అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. వచ్చే ఎన్నికలలో జగన్‌కు అండగా నిలుస్తామంటూ మహిళలు బహిరంగంగా తెలియజేశారు. వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఆమీర్, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, రాతు నాగలక్షుమ్మ, గజేంద్రా రెడ్డి, రవిరాజు, గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహా రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మసాలా తయారీ కేంద్రం ప్రారంభం

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని ఎస్బీ కార్యాలయానికి ఎదురుగా మెప్మా ఆధ్వర్యంలో రూ. 2లక్షల రుణం పొంది ప్రొప్రేటర్ అనురాధదే ఏర్పాటైన పట్టణ ప్రగతి చిన్న తరహా మసాలాల తయారీ కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్లు, అధికారులతో కలసి ఆయన ప్రారంభించారు.

అభివృద్ధిలో మేటిగా రాయచోటి పట్టణం

రాయచోటి అర్బన్ : అభివృద్ధిలో మేటిగా రాయచోటి పట్టణాన్ని నిలపడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రూ. 50లక్షలతో నిర్మాణాలు పూర్తయిన సుందరీకరణ పనులను మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్లతో కలసి శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, వైఎస్ఆర్‌సీపీ నేతలు బేపారి మహమ్మద్‌ఖాన్, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

నగరవనం పనుల పరిశీలన

సందర్శకుల అందమైన కలలకు మరో రూపంలా నగరవనం రూపుదిద్దుకుంది. రాయచోటి పట్టణానికి కూతవేటు దూరంలో ఎగువ అబ్బవరం సమీపంలో 80 ఎకరాలలో నగరవనం నిర్మాణం పనులు ఎమ్మెల్యే సందర్శించారు. సందర్శకులకు ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యాన్ని అందించేలా నగరవనాన్ని నిర్మించారు. ఇందులో వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్‌జిమ్, నక్షత్రవనం, రోజ్‌గార్డెన్, మెడిసనల్ గార్డెన్, ట్రెక్కింగ్, నర్సరీ తదితర పనులు పూర్తయ్యాయి. ఈనెల 27న ఫారెస్ట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ మధుసూదన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తదితర ప్రముఖులతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు.

పరామర్శ

సంబేపల్లె : శెట్టిపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.రమణారెడ్డికి బైపాస్ సర్జరీ చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం ఆయన్ను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. త్వరితగతిన ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు భాస్కర్ రెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో జరిగే గణతంత్ర్య దినోత్సవ వేడుకలో అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అధికారుల సహకారం జిల్లా కేంద్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు 75వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సి.దిలీప్ కుమార్ ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వం కొన్ని వేల కోట్ల రూపాయల ఖర్చుతో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే సదాశయంతో విద్యార్థులకు ట్యాబ్‌లు, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులను జగనన్న విద్యా కానుక కింద ఇస్తోందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్యాబ్‌లను విద్యార్థులు సరిగా వాడుతున్నారో లేదో చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, వారు కూడా ప్రతిరోజూ వారి పిల్లలను గమనిస్తూ ఉండాలని తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరం

రైల్వేకోడూరు : ఈనెల 30వ తేది మంగళవారం అనంతరాజుపేట ఎంపీపీ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని కరుణామయి ఛారిటబుల్ అనుపత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ బండారు మల్లికార్జున గురువారం తెలిపారు. కంటి శుక్లాలు, ఆపరేషన్‌లు, కార్నియా, మొలలు, చెవి, ముక్కు, గొంతు, స్త్రీ వ్యాధులకు వైద్యం అందించి ఉచిత ఆపరేషన్‌లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అన్ని రకాల జబ్బులకు సంబంధించిన వైద్యులు పాల్గొంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళల ఆర్థికస్వావలంబనతోనే సమాజాభివృద్ధి

- హామీని నిలబెట్టుకున్న సీఎం జగన్‌కు ఆశీస్సులు అందించండి
- ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

చిట్వేలి : సంక్షేమ ఫలాలు అందించడంలో మహిళలకు ప్రాధాన్యం ఇచ్చి మహిళా పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా నాల్గో విడత పంపిణీ వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ఆర్థిక స్వాలంబన సాధించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందని విశ్వసించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. మండలంలోని 446 స్వయం సహాయక సంఘాలకు రూ.13 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. మహిళలను అన్ని విధాల ఆదుకుంటున్న జగనన్నకు అందరి అండదండలు, ఆశీస్సులు ఉండాలని కోరారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. అలాగే ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎల్‌వీ మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, ఎంపీపీ చంద్ర, టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, తహసీల్దార్ శిరీషా, ఎంపీడీఓ శివరామిరెడ్డి, డ్వాక్రా ఏరియా కో–ఆర్డినేటర్ రంజాన్, ఏపీఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఓబులవారిపల్లె : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం గాదెల వెంకటాపురం దళితవాడ గ్రామంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పర్యటించారు. వైఎస్సార్ పార్టీ కార్యకర్త నాగతోటి పెంచలయ్య ఇంట్లో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, ఎక్కడ కష్టం వచ్చినా తాము ఆదుకుంటామన్నారు. అనంతరం గ్రామ ఎంపీటీసీ పి.ఈశ్వరమ్మ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గమనించి ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పంజం సుకుమార్ రెడ్డి, గుంటిమడుగు సుధాకర్ రాజు, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ సుంకేసుల రఫీ, నాయకులు నారాయణ రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ విజేత రైల్వేకోడూరు


ట్రోఫీని అందజేస్తున్న ఎంపీపీ మేడా, నిర్వాహకులు

నందలూరు(రాజంపేట) : మన గ్రామీణ క్రీడలలో భాగమైన కబడ్డీ ఆట నేడు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు పొందిందని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకటమల్లికార్జున రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని జనాబ్ ఎస్టీ ఖాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరవపల్లె జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. పోటీలలో కోడూరు జట్టు విజేతగా నిలిచి రూ. 10 వేలు నగదు, ట్రోఫీని ఎంపీపీ అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన ఆరవపల్లె–7 డెవిల్స్ టీమ్‌కు కెఎస్‌టి అక్వా లీడ్ సంస్థ నిర్వాహకులు తోట కేదార్‌నాథ్ బాబు రూ. 7 వేలు నగదు, ట్రోఫీని అందజేశారు. తృతీయ బహుమతి అబ్బాస్ బిల్డర్స్ సంస్థ, కన్సలేషన్ బహుమతిని గోపినేని హిమగిరినాథ్ యాదవ్‌లు క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు ఖలీముల్లా ఖాన్, షమీవుల్లా ఖాన్, జుల్ఫికర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు అన్నం నాగేంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి దోహదపడదాం


గ్రామ పర్యటనకు సిద్ధమైన ఎన్‌ఎస్‌ఎస్ బృందం

రాజంపేట రూరల్ : దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించి అభివృద్ధికి దోహదపడదామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, శ్రీవైష్ణవి డిగ్రీ కళాశాల కరస్పాండెట్ పోలా వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక శ్రీ వైష్ణవి కళాశాల వద్ద ఎన్‌ఎస్‌ఎస్ టీం గ్రామ పర్యటనను ప్రిన్సిపల్ ఎం.ఈశ్వరయ్యనాయుడుతో కలిసి కరస్పాండెంట్ వెంకటరమణారెడ్డి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కొండ్లోపల్లి గ్రామంలో తమ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. నేటి నుంచి 31వ తేదీ వరకు ఆ గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాల్లో నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీయూపీ స్కూల్ హెచ్‌ఎం ఎస్.సోమశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ పి.కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

శుభ్రతను పాటించండి

వీరబల్లి (రాయచోటి టౌన్) : కార్యాలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి అధికారులకు సూచించారు. ఎంపీడీఓ మల్లీశ్వరితో కలిపి మండల పరిషత్ కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు తమ ప్రభుత్వ కార్యాలయ ఆవరణలలో వ్యర్థపదార్థాలను తొలిగించడంతోపాటు పిచ్చి మొక్కలు తొలగించాలని చెప్పారు. ఏఈ కృష్ణయ్య, వెలుగు ఖాదర్ వలి, ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

దేశ ఐక్యతలో 'పటేల్' కృషి ఎనలేనిది


మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లె : సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గుర్తించుకొని దేశ శ్రేయస్సు కోసం పాటుపడాలని శ్రీ వెంకటేశ్వర కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో (జాతీయ ఐక్యత దినోత్సవం) సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి ఎస్‌పీ కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొదట సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ సర్దార్ పటేల్ దేశ ఐక్యత కోసం ఎనలేని కృషి చేశారన్నారు. దేశ మొట్టమొదటి ఉప ప్రధానిగా, హోం మంత్రిగా సేవలందించిన ధీశాలి అని కొనియాడారు. భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి 1991లో భారతరత్న అవార్డు ఇచ్చి సత్కరించిందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు మానవహారంగా ఉండి జాతీయ సమైఖ్యతా ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

ఓబులవారిపల్లె : వైద్యాధికారులు సమయం పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చెన్నకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు టీకాలు సకాలంలో క్రమం తప్పకుండా అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఆరోగ్య కేంద్రం పని వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గురుమహేష్, దీప, ఓబులేశు, ఫార్మాసిస్టు మహాలక్ష్మి, సీహెచ్‌ఓ నగేష్, స్టాఫ్ నర్సు ఇమామ్ బీ, జయభారతి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ఓబులవారిపల్లె : బొమ్మవరం గ్రామంలో గత కొద్దిరోజులుగా గ్రామంలోని రెండు బోర్లు కాలిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి వెంటనే స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించారు. గ్రామంలో రెండు కొత్తమోటార్లు, స్టాటర్లు, వైర్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించి సమస్యను పరిష్కరింపజేశారు. గురువారం సర్పంచ్ లొడి గంగరాజు ఎంపీపీ–1 గూడూరు గౌరీ శంకర్ రాజు పనులు పూర్తి చేయించారు. గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

గాదెల గ్రామంలో..

ఓబులవారిపల్లె : గాదెల గ్రామంలో గత కొద్దిరోజులుగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించి ఆయన గాదెలలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో కొత్త బోరుకు నిధులు మంజూరు చేయించారు. దీంతో గ్రామంలో నూతన బోరు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకం


రాజంపేట: ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, డీఎస్పీ చైతన్య

గాలివీడు : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధమని ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ దైవాదీనం అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్లకార్డులు చేతబట్టి బస్టాండ్ నుంచి గేటు వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తిమ్మారెడ్డి, ఆర్‌ఐ బాలాజీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, అది వారి హక్కు అని తహసీల్దార్ నరసింహ కుమార్ పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేసి సీనియర్ సిటిజన్లను సన్మానించారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని పోలింగ్‌బూత్‌లో 11 సార్లు ఓటు హక్కును వినియోగించుకున్న సీనియర్ సిటిజన్‌ను గురువారం ఉప్పరపల్లి సర్పంచ్ మేరువ బాలాజీ శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. జాతీయ ఓటరు దినోత్సవం కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు ప్రభాకర్‌రెడ్డి, మనోహర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం వంటిదని తహసీల్దార్ శిరీషా పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం తహసీల్దార్ శిరీషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ తీశారు. అనంతరం విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఐదుగురు సీనియర్ సిటిజన్లకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు కోదండనాయుడు, ఈశ్వరయ్య, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, ఆర్‌ఐ శేషంరాజు, ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు అందరి హక్కు

– ఆర్డీఓ రామకృష్ణారెడ్డి

రాజంపేట : ఓటు అందరి హక్కు అని రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కలిగి ఉండాలన్నదే ఎన్నికల సంఘం లక్ష్యమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది ఒక ఆయుధమన్నారు. ఓటర్ల జాబితా పూర్తి అయ్యిందని తెలియజేశారు. కార్యక్రమంలో రాజంపేట డీఎస్పీ చైతన్య, తహసీల్దారు సుబ్రమణ్యంరెడ్డితోపాటు రెవెన్యూ అధికారులు, పోలీసులు, ఆర్డీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. జాతీయఓటర్ల దిన్సోత్సవం సందర్భంగా పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టారు. రాజంపేట ఆర్డీఓ సభా భవనంలో 80 సంవత్సరాలు, 18 సంవత్సరాలు నిండిన వారిని శాలువా కప్పి సన్మానించారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ మహేశ్వరీబాయ్ అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్ర, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదవ్వాలి

వీరబల్లి (రాయచోటి టౌన్) : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి కోరారు. గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువతకు ఓటు ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఓటు అనేది యువత చేతిలో వజ్రాయుధంగా మారాలని అందుకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని చెప్పారు.